అమెరి'కులాసా' కథలు – వంగూరి చిట్టెన్‌రాజు





అమెరికులాసా కథ – 218

అమెరి'కప్పల తక్కెడ' స్వర్ణోత్సవాలు

హమ్మయ్య....సుమారు మూడు నెలల హడావుడి తర్వాత మొత్తానికి మా హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి స్వర్ణోత్సవాలు మొన్న ఆగస్ట్ 7– 8, 2026 తేదీలలో అత్యంత వైభవంగా జరిగాయి. 50 ఏళ్ళ క్రితం హ్యూస్టన్ లో కేవలం 50 తెలుగు కుటుంబాలు మాత్రమే ఉన్న రోజుల్లో మొదటి (సహ) అధ్యక్షుడిగా, బ్రహ్మచారిగా మొదలయిన నా ప్రస్థానం ఇప్పుడు ఇద్దరు మనవలు, ఇద్దరు మనవరాళ్ళతో సకుటుంబంగా ఈ సంస్థ స్వర్ణోత్సవాలలో పాల్గొంటున్న నాకు "వీడు ఇంకా బతికే ఉన్నాడు రోయ్"అని కాబోలు ఏకంగా నాలుగు పతకాలు, శాలువాలతో సత్కరించబడడం మటుకు మహదానందంగానే ఉంది. టీసీయే అని ముచ్చటగా పిలుచుకునే మా సంస్థకి వ్యవస్థాపకుడిగా, 2003 లో రజతోత్సవాలు నిర్వహించిన అధ్యక్షుడిగా, ఈ స్వర్ణోత్సవాల కోసం నేను ప్రత్యేకంగా వ్రాసిన "స్వాగత గీతం", స్వర్ణ వైభవం" దృశ్య కావ్య రచయితగా....అన్నింటికీ పరాకాష్టగా గత 50 ఏళ్ళ 'సాహిత్య చాకిరీ" కి గుర్తింపుగా 'జీవన సాఫల్య పురస్కారం" ప్రదానం. ఇదీ ఆ పతకాల జాబితా....అన్నీ తీసుకుని ఇంటికి రాగానే మా క్వీన్ విక్టోరియా గార్బేజీ లోకి కాదు కానీ గరాజ్ లోకి విసిరేయబోతే నేను వల వేసి పట్టుకుని ఆవిడకి కనపడకుండా దాచుకున్నాను. 🤣🤣



ఈ సంబరాల ముందు రోజు మాంచి ఆర్భాటంగా బేంక్వెట్ డిన్నర్ జరిగింది. ఆ మధ్య ఎప్పుడో మిత్రుడు తనికెళ్ళ భరణి అనుకుంటాను... సరదాగా చెప్పినట్టు "అమెరికా సభలలో బేంక్వెట్ డిన్నర్ అంటే "ఎవడి తిండి వాడు తింటూ ఉంటారు, ఎవరి తాగుడుతో వారు తూలుతూ ఉంటారు, ఒకరి శాలువాలు ఇంకెవరో కప్పుతూ, మరొకరు పతకాలు ఇచ్చేస్తూ ఉంటారు. ఇండియా నుంచి డబ్బిచ్చి పిలిపించుకున్న వాళ్ళు కేబరే డాన్స్ లు, సినిమా డేన్సులూ చేస్తూ ఉంటే మధ్యే మధ్యే కూచిపూడి జతులు, తెలుగు మాటలు కనపడుతూ వినపడుతూ ఉంటూ భలే సంబడంగా ఉంటుంది". మా హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి వారి స్వర్ణోత్సవాల బేంక్వెట్ విందు కూడా ఇంచుమించు ఆ

పద్ధతిలోనే "అమెరి'కప్పల తక్కెడ' లాగా బాగా జరిగింది. నాకు సంబంధించినంత వరకూ ఆ రోజు అనుభవాలు రెండు రకాలు...మొదటిది మొదటి వరసలలో సినీ తారలు, ఇతర ప్రముఖులనీ కూచో బెడుతూ, పలకరిస్తూ నేను హడావుడి చేసేసుకోవడం. ఈ సినీ ప్రముఖుల హడావుడి కార్యక్రమం లో పాల్గొన్న వారిలో గాయని సునీత ఉపద్రష్ట నాకు బాగా తెలిసిన అమ్మాయే కాబట్టి ఉన్నంత లోనే కాస్సేపు కబుర్లు చెప్పుకుని సెల్ఫీ తీసేసుకున్నాం. ఆ తర్వాత స్టేజ్ మీద కూడా కలిసే ఉన్నాం కానీ అది గుంపులో గోవిందలాగా ఉంది. మరొక సినీ మానవుడు రాజేంద్ర ప్రసాద్...ఇతను కూడా తెలిసిన వాడే కానీ నన్ను గుర్తు పట్టి "రాజు గారూ, బావున్నారా?" అని పలకరించి మాట్లాడడం కొంచెం హాచ్చెర్యం గానే ఉంది. మరొకమ్మాయి ఎవరో రీతు వర్మ ట...నిజానికి ఆ హీరోయిన్ బేంక్వెట్ హాలు గుమ్మం లో అడుగుపెట్టగానే ఒక పెద్ద నిర్వాహకుడు నన్ను లాక్కెళ్ళి "ఈయనే మా సంఘం మొదలెట్టాడు" లాంటి మాటలతో పరిచయం చెయ్యబోయాడు. ఆమె తన చిరునవ్వులు మరెవరికో కేటాయించడంతో ఈయన చిన్న బుచ్చుకుని మళ్ళీ ప్రయత్నించగానే నాకంటే రెండు అడుగుల ఎత్తులో ఉన్న ఆ సుందరాంగి "సో వాట్?" అన్నట్టుగా నాకేసి ఒక కింద చూపు విసిరేసి పక్కనే ఉన్న సెల్ఫీ బేచ్ కేసి మళ్ళిపోయింది. అంత పొడుగున్న అమ్మాయితో సెల్ఫీ దిగడం ఏమిటీ, నా వల్ల కాదు....సారీ వల్లకాదు! మరొక నటుడు ఆలీ చాలా మర్యాదగా పలకరించి మాట్లాడాడు. ఇక మా సాహిత్య వేదిక తరఫున ఆహ్వానించిన జొన్నవిత్తుల గారు, నాకు ఎంతో ఆత్మీయురాలైన మా బలబద్రపాత్రుని రమణి, పేరడీ గాయని అరుణ సుబ్బారావు, అవధాని పాలపర్తి గారు, వామరాజు సత్యమూర్తి గారు, ఇతర ఆహ్వానితులతో గుండ్రం బల్ల చుట్టూ కూచుని కబుర్లు చెప్పుకున్నాం. అందరిలోకీ హాయిగా, ఎంతో వినయంగా ఉన్నవాడు, నేను స్వయంగా ఆహ్వానించిన అవసరాల శ్రీనివాస్. ఇతను ఇందాకా చెప్పిన పొడుగాటి రీతూ వర్మ కన్నా అన్ని విధాలా ఇంకా ఎత్తునే ఉన్నప్పటికీ నేల మీదే ఉన్నాడు. ఈ రెండు రోజులలోనూ మా ఇద్దరికీ భలే స్నేహం కుదిరింది.





ఇక నా జీ.సా.పు...అనబడే జీవన సాఫల్య పురస్కారం....ఇలాంటి వాటిల్లో ఎప్పటి లాగానే ముందు పక్కా ప్రణాళిక వేస్తారు కానీ స్టేజ్ మీదకి రాగానే అంతా "కప్పల తక్కెడ" అవుతుంది. ఎందుకంటే వేదిక మీద నిర్వహణ చేస్తూ అటూ ఇటూ తిరిగేస్తూ హడావుడి చేసేస్తూ, ఫొటోలలోనూ, వీడియోలలోనూ కనపడడానికి అసలు నిర్వహణ చేసే వాళ్ళని ఆ పని చెయ్యనివ్వకుండా 'నిరవాకం' చేసే బేచ్ మొత్తం మైక్రో మేనేజ్ చెయ్యడం ఈ కప్పల తక్కెడకి కారణం. నా విషయం లో కూడా వేదిక మీద సత్కారం చేయించుకునేది నేనూ, మా సతీమణీ మాత్రమే అయినా, సత్కారం చెయ్యడానికి ప్రధాన నిర్వాహకులే కాక ఈ కప్పల బేచ్ ఐదారుగురి తో పాటు జొన్నవిత్తుల గారు, "నటకిరీటి" రాజేంద్ర ప్రసాద్, హాస్య నటుడు ఆలీ, ఐక్యరాజ్య సమితిలో భారత రాయబారి హరీష్ పర్వతనేని గారు, ఆయన సతీమణి నందిత గారు, స్థానిక ఇండియా కాన్సుల్ జనరల్ మంజునాథ్ గారు మొదలైన వారు చాలా మంది ఉండడంతో కాస్త కంగారు ఉంది.

అసలు పిలవ వలసిన మా బలభద్రపాత్రుని రమణి గారినీ, నటుడు అవసరాల శ్రీనివాస్ నీ వాళ్ళు స్టేజ్ మీదకి పిలవడం మర్చే పోయారు. ముందుగా "ఎవడీ కోన్ కిస్కాయ్" అనుకునే వాళ్ళ కోసం వెనక తెర మీద రకరకాల "భంగిమ" లలో నా ఫొటోలు వేస్తూ, నా జీవితం గురించి నాకే తెలియని సంగతులు చెప్పి ఈ పురస్కారం ఇవ్వడానికి సంజాయిషీ ఇచ్చారు. అదయ్యాక మామా మహేశ్.... బాగా పేరున్న రేడియో జాకీ ట.... అతను మంచి వ్యాఖ్యానం చేస్తున్న నేపధ్యం లో కవి జొన్నవిత్తుల గారు ఎంతో గౌరవంగా మా ఇద్దరికీ ఒక శాలువా కప్పారు కానీ అది నా ఒక్కడికీ సరిపోయింది.

అప్పటి దాకా ఆ వీడియో వేస్తున్నప్పుడు "ఏమిటి ఈ సుత్తి" అన్నట్టు విసుగ్గా ఉన్న నట కిరీటి రాజేంద్ర ప్రసాద్ అంతే చికాకుగా నాకు టోపీ పెట్టి, మెమెంటో నా చేతిలో కుక్కేసి కాస్సేపు ఆగాక "ఇక అయిపోయిందిగా" అని వేదిక దిగిపోతూ పాపం వ్యాఖ్యాత మహేష్ మీద నిజంగానే విసుక్కునాడు. అంతా అయిపోయి, అందరం వేదిక దిగబోతూ ఉండగా ఈ లోగా వేదిక మీద పిలవడం మర్చిపోయిన నటుడు అవసరాల శ్రీనివాస్ ని మళ్ళీ పిలవగానే పాపం అతను వచ్చి నిస్సహాయంగా నుంచుంటే నేను వెనక్కి వెళ్ళి మళ్ళీ టోపీ పెట్టించుకున్నాను. ఎందుకంటే అతను నా ఆహ్వానం మీద ఈ సభలకి వచ్చాడు మరి!. ఈ తతంగం అంతా ఉన్న వీడియో లింక్ ఈ క్రింద ఇచ్చాను. ఇందులోనే ఆలీ, రాజేంద్ర ప్రసాద్, తదితరుల ప్రసంగాలు కూడా ఉన్నాయి.

జీవన సాఫల్య పురస్కారం: https://youtu.be/T1q8jLat47w

ఈ మొత్తం స్వర్ణోత్సవాలలో నాకు నిజంగా గర్వకారణం...ఏనాడూ ఊహించని గేయ రచయితగా నా కొత్త అవతారం. మూడు నెలల క్రితం ఈ స్వర్ణోత్సవాలు చేద్దాం అనే ఆలోచన వచ్చినప్పుడు కన్వీనర్ గా ఎన్నికయిన జితెందర్ రెడ్డి గారు నన్ను పిలిచి "అందరూ డంగై పోయేలా ఒక స్వాగత గీతం కావాలి అనడం, నేను ఆలోచించగా..చించగా స్వాగత గీతం తో పాటు మా సంస్థ 50 ఏళ్ళ ప్రస్థానాన్ని ప్రతిబింబిస్తూ "స్వర్ణ వైభవం" అనే గీతాన్ని వ్రాసి, మా రత్న పాప చేత శాస్త్రీయ నాట్యం రూప కల్పన చేయిద్దాం అనేసుకున్నాను. వారం రోజుల్లో వ్రాయ గలిగాను. అది అందరికీ నచ్చగానే నేమాని పార్థతో మ్యూజిక్ చేయించి రమ్య బెహరా, శ్రీకృష్ణ మొదలైన ప్రముఖ గాయనీగాయకుల చేత పాడించాం. ఇక మా రామ్ చెరువు అద్భుతమైన గ్రాఫిక్స్ చేశాడు. జోశ్యుల వేణు గోపాల్ సహాయకుడిగా రత్న పాప కోరియాగ్రఫీ చాలా బాగా కుదిరింది. ఈ రెండింటి వీడియో లింక్స్ ఈ క్రింద ఇచ్చాను.

స్వాగత గీతం: https://youtu.be/0phL7x47ZW8

స్వర్ణ వైభవం: https://youtu.be/VO1ZRcg7-S8

ఇక్కడ కప్పల తక్కెడ ఏమిటంటే ...స్వాగత గీతం సమయంలో ఇండియా నుంచి దిగుమతి అయిన ఏంకరమ్మాయి ముందు "దడిగాడు వానసిరా" పేరు చెప్పింది కానీ నృత్యం అయ్యాక నన్ను, రత్న పాపనీ, రామ్ చెరువునీ వేదిక మీద పిలవనే లేదు. ఇక స్వర్ణ వైభవం సమయం లో ఆ మాత్రం కూడా లేదు సరి కదా, నేనూ, రత్న పాపా వేదిక మీద వెళ్ళి నుంచున్నా మా పేర్లు చెప్ప లేదు సరి కదా, కనీసం గుర్తించనైనా లేదు. చెప్పొద్దూ..భలే చికాకు వేసింది.

కొస మెరుపు.....ఈ స్వర్ణోత్సవాలలో మా ఇద్దరు అమ్మాయిలూ చాలా కాలం తర్వాత కలిసి "శివాష్టకం" కూచిపూడి నృత్యం చేశారు...మా రత్నపాప శిష్యురాళ్ళే....ఆ లింక్: https://youtu.be/YPoyS16bMNA

ఇవన్నీ చదివిన వాళ్లకి చదివినంత....చూసిన వాళ్ళకి చూసినంత....ఏమంటారు?

★★★★

COMMENTS